
# సింగరాల మల్లన్న సిద్ధం

● 12న జాతర ప్రారంభం
● ఉగాది వరకు ఉత్సవాలు
● ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు



జప్తిలింగారెడ్డిపల్లిలో సింగరాల మల్లన్న దేవాలయం

**తొగుట(దుబ్బాక):** మండలంలోని జప్తిలింగా రెడ్డిపల్లి శ్రీసింగరాల మల్లన్న ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రతియేటా సంక్రాంతి ముందు వచ్చే ఆదివారం ప్రారంభమై ఉగాది వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయి. అందులో భాగంగా 12న మల్లన్న ఉత్సవాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రతినెలలోను చివరి ఆదివారం స్వామికి పూజలు నిర్వహించి వేడుకలు జరుపుకుంటారు.

**ప్రజల విశ్వాసం..**

ఆలయానికి రాతి కడప ఉండటంవల్ల ప్రకృతి ప్రళయాలకు నేటి వరకు ఎలాంటి పంట నష్టం జరగదని గ్రామస్తుల నమ్మకం. ఆలయం కింది భాగం నుంచి ఈశాన్యంలో ఉన్న కొలనులోకి వచ్చే నీళ్లు సేవించిన వారికి ఎలాంటి అనారోగ్య సమస్యలు దరిచేరవని ప్రజల విశ్వాసం. అలాగే బావిలోని నీటిని పంట పొలాల్లో చల్లితే చీడపీడలు రావని గ్రామపెద్దలు చెపుతారు.

**ప్రత్యేక పూజలు**

ఈ నెల 12న ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం స్వామి వారికి కల్యాణం నిర్వహిస్తారు. సాయంత్రం పట్నాలువేసి బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తారు. అనంతరం ఎడ్లబళ్లు, ట్రాక్టర్లతో స్వామివారి ఆలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహిస్తారు.



స్వామివారు

ఆలయ పరిసరాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. అలాగే భక్తులకు నడచివేళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మించారు. మల్లన్న జాతరకు మండల ప్రజలతో పాటు సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక పట్టణాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుంటారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లుచేసినట్టు మాజీ సర్పంచ్ జ్యోతిమల్లారెడ్డి తెలిపారు.

## వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు

**నంగునూరు(సిద్దిపేట):** వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని నంగునూరు, కోనాయిపల్లి, పాలమాకులలోని వేంకటేశ్వరాలంలో ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాటు పూర్తిచేశారు. శుక్రవారం ఉదయం స్వామివారి పల్లకి ఊరేగింపు, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 5గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉత్తరద్వార దర్శనం కల్పిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ నిర్మాత మంగు రాధాకిషన్ రావు, పూజారి రణధీరాచార్యులు, దుర్గయ్య తెలిపారు.

# పూర్వ విద్యార్థుల రూ.6లక్షల విరాళం



ప్రిన్సిపాల్ సునీతకు చెక్కులను అందిస్తున్న పూర్వవిద్యార్థులు

**సిద్దిపేటఎడ్యుకేషన్:** తాము చదువుకున్న కళాశాలకు తమ వంతు సహకారాన్ని అందించాలనుకున్నారు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల పూర్వవిద్యార్థులు. 1974లో డిగ్రీ పూర్తిచేసుకుని ఇటీవల స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. కళాశాల అభివృద్ధి కోసం ఆ బ్యాచ్‌కు చెందిన నరసయ్య(జీహెచ్ఎంసీ రిటైర్ ఉద్యోగి) రూ.5లక్షలు, ఆర్ఎంసీ ప్యాకేజింగ్ సంస్థల అధినేత అబ్బ మల్లారెడ్డి రూ.లక్ష చెక్కులను గురువారం విరాళంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఈ కళాశాలలో చదువుకోవడం మూలంగా ఉన్నతంగా స్థిరపడ్డామన్నారు. కళాశాల అభివృద్ధి చెందితే మరెంతో మంది విద్యార్థులు చదువుకుని జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలన్నదే తమ లక్ష్యమన్నారు. అందుకోసం కళాశాల అభివృద్ధికై తమవంతు సహకారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు విరాళం అందించడం గొప్ప విషయమన్నారు. పూర్వ విద్యార్థులు గణేశ్, హరిచ్చంద్ర, మహిపాల్ రెడ్డి, సత్యనారాయణ, నర్సయ్య, రమేశ్ తదితరులు చురుకైన పాత్ర పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, సీఓఈ డాక్టర్ గోపాలసుదర్శనం, ఐక్యూ కోఆర్డినేటర్ డా.మధుసూదన్, డా.లీలావతి, డా.ఉమా మహేశ్వరి, సూపరింటెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రమాదాలతో కుటుంబాలు చిన్నాభిన్నం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ర్యాలీలో పాల్గొన్న ఏసీపీ సుమన్‌కుమార్ తదితరులు

**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):** రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబాలు చిద్రమవుతున్నాయని, ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా సిద్దిపేట బీజేఆర్ చౌరస్తాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంబరు ప్లేట్లులేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సదాశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

**నిబంధనలు పాటించకపోతే చర్యలు**

**హుస్నాబాద్/వర్గల్(గజ్వేల్)/గజ్వేల్‌రూరల్:** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా పలుచోట్ల పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. హుస్నాబాద్‌లో డీటీఓ కొండలరావు సిద్ధార్థ పాఠశాలలో స్కూల్ వాహనాల డ్రైవర్లకు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. నిబంధనలు పాటించాలని.. లేదంటే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఏఎంవీఐ శ్రీకాంత్ రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మహేశ్, పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు. వర్గల్ మండలం మజీద్‌పల్లి జెడ్పీహైస్కూల్‌లో తొగుట సీఐ లతీఫ్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డు భద్రత, సైబర్ క్రైమ్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. హెచ్ఎం రమేశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బేగంపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి, ఏపీసీ చైర్మన్ లావణ్య, పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గజ్వేల్ రాజీవ్ రహదారిపై రిమ్మనగూడ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంవీఐ క్రిస్టోఫర్ మాట్లాడారు. వాహనదారులు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, రాంగ్‌రూట్లో ప్రయాణం చేయడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారముందన్నారు.

## క్లుప్తంగా

### దాతలు సహాయం చేయాలి



క్రీడా దుస్తులు అందజేస్తున్న డీఈఓ

**నంగునూరు(సిద్దిపేట):** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు దాతలు సహాయం అందించాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. నర్మేట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సిద్దిపేట వైద్యుడు భాస్కర్ గురువారం రూ.35వేలు విలువచేసే క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ చదువులో వెనుకబడ్డ విద్యార్థులను గుర్తించి ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భాస్కర్, ఎంఈఓ దేశిరెడ్డి, హెచ్ఎం మనీష్‌కుమార్, రజిత, కుమార్, సుల్తానా, అర్షద్, యాదగిరి, సునీత పాల్గొన్నారు.

### నాసిరకం ఎరువులు విక్రయిస్తే చర్యలు: ఏఓ



తనిఖీ చేస్తున్న ఏఓ సతీశ్

**కోహెడ(హుస్నాబాద్):** నాసిరకం ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి సతీశ్ హెచ్చరించారు. స్థానిక ఎరువుల దుకాణాలను గురువారం ఆయన తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. రైతులకు బిల్లులను ఇవ్వాలని, కాలంచెల్లిన ఎరువులు, పురుగుల మందులను నిల్వచేయొద్దని చెప్పారు. వాటిని విక్రయిస్తే లైసెన్సులు రద్దుచేస్తామని హెచ్చరించారు.

### పవిత్రమైన రోజు ముక్కోటి ఏకాదశి



పదిపైసల నాణేలతో శంకు, చక్రం, నామం

**గజ్వేల్‌రూరల్:** ముక్కోటి ఏకాదశి ఎంతో పవిత్రమైనరోజని రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు, కళారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన పదిపైసల నాణేలతో శంకు, చక్రం, నామం రూపాలను రూపొందించి గురువారం ప్రదర్శించారు.

**ఆహ్వానం పత్రిక అందజేత**

**జగదేవ్‌పూర్(గజ్వేల్):** స్థానిక వెంకటేశ్వరాలయ కమిటీకి భద్రాచలం దేవస్థాన ముక్కోటి ఏకాదశి ప్రత్యేక ఆహ్వాన పత్రికను రామరాజు అందజేశారు. ఆయన మాట్లాడుతూ భద్రాచల సీతారాముల కల్యాణానికి గ్రామస్తులు గోటి తలంబ్రాలు అందించారన్నారు. కార్యక్రమంలో సభ్యులు వెంకటేశం, కులకర్ణి రఘు, రఘురాం, రాము, ప్రతాప్‌రెడ్డి, భిక్షపతి, కేశవులు, కైలాసం, శివరాం పాల్గొన్నారు.

### వెరిఫికేషన్ అవసరం

**సిద్దిపేటరూరల్:** పీఎం కిసాన్ ఫిజికల్ వెరిఫికేషన్ కోసం వ్యవసాయశాఖ అధికారులు సూచించిన రైతులు ఏఈఓలను సంప్రదించి వెరిఫికేషన్ చేయించుకోవాలని ఏడీఏ పద్మ సూచించారు. నారాయణరావుపేట, జక్కాపూర్, గుర్రాలగొంది గ్రామాల్లో ఏఈఓలు నిర్వహిస్తున్న వెరిఫికేషన్‌ను ఏఓ పరశురాంరెడ్డితో కలిసి గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ క్లస్టర్ల వారీగా నారాయణరావుపేట 52, గుర్రాలగొంది 22, జక్కాపూర్‌లో 44 మంది వెరిఫికేషన్ పెండింగ్‌లో ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు స్పందన, మౌనిక, వరుణ్‌వర్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### 19న ధర్మజాగృతి మహాసభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):** హిందు ధార్మికసంఘాలు, సనాతన హిందుధర్మ జాగృతి సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్మ జాగృతి మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం నిర్వహించిన సమావేశంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 19న గజ్వేల్ యస్ కన్వెన్షన్ హాల్‌లో మహాసభ నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రశాంత్, యాదగిరి, పద్మారెడ్డి మల్లారెడ్డి, రామచంద్రారెడ్డి, కర్ణ నాగరాజు, రాజమౌళి, బాల్‌రెడ్డి, రామచంద్రం, శ్రీనివాసు, నాగయ్య, సత్యం, కిరణ్, శివలింగం పాల్గొన్నారు.

# వైకుంఠ ఏకాదశికి పటిష్ట బందోబస్తు

ఏసీపీ మధు



మాట్లాడుతున్న ఏసీపీ మధు

**సిద్దిపేటకమాన్:** వైకుంఠ ఏకాదశి సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిద్దిపేట ఏసీపీ మధు తెలిపారు. మోహిన్‌పుర వెంకటేశ్వర స్వామి ఉత్తరద్వార దర్శనం సందర్భంగా ఏసీపీ గురువారం సమావేశం నిర్వహించి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ 200మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దర్శనానికి వచ్చే భక్తులు పోలీసుల సూచనలు, సలహాలు పాటించి ప్రశాంతంగా ఉత్తర ద్వారం నుంచి దర్శనం చేసుకోవాలని సూచించారు. సాధారణ దర్శనం, వీఐపీ, వీవీఐపీ దర్శనం, డోనర్స్ దర్శనం, గ్యాలరీలు ఏర్పాటు చేశామని చెప్పారు. వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, రూరల్ సీఐ శ్రీను, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**చేర్యాల(సిద్దిపేట):** మండల పరిధిలోని ముస్త్యాల మోడల్ స్కూల్లో 6వ తరగతిలోని 100 సీట్లతో పాటు 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భిక్షం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలగినవారు ఫిబ్రవరి 28లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

### విద్యార్థినికి రూ.10వేల పురస్కారం

**సిద్దిపేటరూరల్:** ఇటీవల తెలంగాణ గణితఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్టులో ర్యాంక్ సాధించిన ఈర్ల సౌమ్యకు గురువారం మోసర్ల జానకి మాధవరెడ్డి అందించిన రూ.10వేల నగదు బహుమతిని హెచ్ఎం షౌకత్‌అలీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు ఎల్లప్పుడు సహకరిస్తున్న ఎన్నారై జానకికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ పరశురాములు, ఉపసర్పంచ్ కనకాంబరం తదితరులు పాల్గొన్నారు.



# వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు





సిద్దిపేటఎడ్యుకేషన్: మాట్లాడుతున్న సీఐ వాసుదేవరావు

వన్‌టౌన్ ఎస్ఐ వాసుదేవరావు

**సిద్దిపేటఎడ్యుకేషన్:** మహిళల పరిరక్షణ కోసం కఠినమైన చట్టాలు ఉన్నాయని సిద్దిపేట వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో గురువారం మహిళల కోసం ఉన్న చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్, షీటీం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మట్లాడారు. మహిళలు, బాలికలు మొబైల్ ఫోన్‌లను జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, ఏఎస్ఐ కిషన్ పవార్ మాట్లాడారు. ఇబ్బందులకు గురైతే ధైర్యంగా షీటీంకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో షీటీం సిబ్బంది మమత, సత్యనారాయణ, ప్రవీణ్, నగేష్, కనకచంద్రం, దేవయ్య, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణ, రఘురాజ్, రాజ్యలక్ష్మి, ప్రసాద్, సత్యనారాయణ, కొమురయ్య, నవనీత పాల్గొన్నారు.

**అపరిచితులపై అప్రమత్తం**

**అక్కన్నపేట(హుస్నాబాద్):** అపరిచితులపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సీఐ శ్రీనివాస్ సూచించారు. గౌరవెల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేస్తే ఎలాంటి వివరాలను తెలియజేయవద్దన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జ్యోతి, షీటీమ్ బృందం, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

### 11నుంచి క్రికెట్ టోర్నీ

**మిరుదొడ్డి(దుబ్బాక):** యువజన వారోత్సవాలు, సంక్రాంతిని పురస్కరించుకుని 11వ తేదీ నుంచి 15 వరకు మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నైపుణ్య ఆర్గనైజేషన్ చైర్మన్, ఐపీఎల్ ఆర్గనైజర్ మొగుళ్ళ ఐలయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ టోర్నీలో గెలుపొందిన టీముకు రూ.11,111, రన్నర్ టీముకు రూ.5,555 నగదుతో పాటు, ట్రోఫీని అందజేస్తారన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు శుక్రవారంలోపు పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు కొండల్‌రెడ్డి, చంద్రకుమార్, సాయిలు, హరివిష్ణు, కృష్ణ, సుధాకర్ పాల్గొన్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ

**సిద్దిపేటరూరల్:** తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ మనుచౌదరి గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేయడంలో అధికారులపాత్ర ముఖ్యమైనదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస్ రావు, కొండల్ రెడ్డి, నరసింహ, సుజాత, ఖాజా మొయినుద్దీన్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

### మందుబాబులకు జరిమానా

**సిద్దిపేటకమాన్:** మద్యంతాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు కోర్టు జరిమానాతో పాటు జైలు శిక్ష విధించింది. సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో ఆరు రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో ముగ్గురు పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి గురువారం వారికి రూ.6వేల జరిమానా, ఒకరికి ఐదు రోజుల జైలుశిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.



సిద్దిపేటజోన్: స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు

### రంగవల్లుల సందడి

ముందస్తు సంక్రాంతి సంబురాల్లో భాగంగా జిల్లాలో రంగవల్లుల సందడి మొదలైంది. పలు మండలాల్లో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అందులో భాగంగా సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన పోటీలకు డాక్టర్ శాంతి, అరుణ, మున్సిపల్ కౌన్సిలర్ శ్రీదేవి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు హరికృష్ణ , లక్ష్మి, అత్తు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో



బెజ్జంకి(సిద్దిపేట): తోటపల్లిలో..

### వెయ్యి ఈత మొక్కల పెంపకం

**అక్కన్నపేట(హుస్నాబాద్):** నిర్వాహకులు నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఎంపీడీఓ జయరాం సూచించారు. మండలంలోని పోతారం(జే)లోని నర్సరీని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం డంపింగ్ యార్డు, పంచాయతీ కార్యాలయాలన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్నీ గ్రామాల్లోని నర్సరీల్లో వెయ్యి ఈత మొక్కలను పెంచాలని ఆదేశించామన్నారు. మొక్కలను చంటి పాపలా కాపాడుకోవాలని, ప్రతి నర్సరీలోను మొక్కలకు గాలి తగిలేలా షేడ్‌నెట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ మోహన్‌నాయక్, ఉపాధి హామీ ఏపీఓ ప్రభాకర్, టెక్నికల్ అసిస్టెంట్ ఉమేశ్, పంచాయతీ కార్యదర్శులు మహేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

సీఐ లతీఫ్



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ లతీఫ్

**తొగుట(దుబ్బాక):** నేరాలు నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని సీఐ లతీఫ్ అన్నారు. మండలంలోని లింగాపూర్‌లో తగరం నర్సయ్య, రాములు, మల్లేశం ఇళ్లలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఎక్కడైనా నిరుపయోగంగా ఉన్నా, మరమ్మతులు అవసమైనా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన చోట నేరాలు తగ్గాయని, అవి 24గంటలు ప్రజలకు రక్షణగా నిలుస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకున్న వారిని సీఐ సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ రవికాంత్‌రావు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

◆ **శిశుమందిర్‌లో ముందస్తు సంక్రాంతి**

**గజ్వేల్‌రూరల్:** స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో ముందస్తు సంక్రాంతి సంబురాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థులు వివిధ రకాల వంటకాలను ప్రదర్శించారు. విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం కరస్పాండెంట్ హరిణాపవన్ మాట్లాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **ప్రచార రథయాత్ర ప్రారంభం**

**సిద్దిపేటకమాన్:** ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా వెయ్యి గొంతులు, లక్ష డప్పులతో నిర్వహించే రథయాత్ర కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు సిద్దిపేటలో గురువారం ప్రారంభించారు. అంతకుముందు ర్యాలీగా వచ్చి బస్టాండ్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. నాయకులు అశోక్, హరికృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

◆ **13 నుంచి మల్లికార్జునస్వామి ఉత్సవాలు**

**హుస్నాబాద్‌రూరల్:** మండలంలోని పొట్లపల్లి మల్లికార్జునస్వామి ఉత్సవాలు 13 నుంచి 15 వరకు జరుగుతాయని ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఆలయంలో ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేలా జాతర జరిపించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి పృథ్వీరాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **ఫాతిమా షేక్ కృషి మరువలేనిది**

**గజ్వేల్‌రూరల్:** విద్యావ్యాప్తికి ఫాతిమా షేక్ చేసిన కృషి మరువలేనిదని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి అన్నారు. సంగాపూర్‌లోగల జేహెచ్ఆర్ పాఠశాలలో గురువారం ఫాతిమాషేక్ జయంతి నిర్వహించారు. నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

◆ **విద్యాభివృద్ధికి పాటు పడాలి**

**దుబ్బాకటౌన్:** ప్రతి ఒక్కరు విద్యాభివృద్ధికి పాటు పడాలని ఎంఈఓ సత్యనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. రాయపోల్ మండలం అనాజీపూర్, రామారం పాఠశాలలకు సికింద్రాబాద్ రోటరీ క్లబ్, బేగంపేట సత్యసాయిసేవా సమితి ఆధ్వర్యంలో గురువారం డెస్కులను అందజేశారు. హెచ్ఎంలు మేరీ నిర్మల, నర్సింహులు, ఉపాధ్యాయులు హరిహర ప్రసాద్, తులసీదాస్, సీఆర్పీలు పాల్గొన్నారు.

◆ **సోలార్‌యూనిట్ ఏర్పాటుకు స్థలం**

**సిద్దిపేటరూరల్:** ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా సోలార్ యూనిట్‌లను ఏర్పాటు చేయనున్న క్రమంలో నాలుగెకరాల భూమిని కేటాయించినట్లు తహసీల్దార్ హైమద్‌ఖాన్ తెలిపారు. నారాయణరావుపేట మండల పరిధిలోని గోపులాపూర్‌లో గురువారం స్థలాన్ని గుర్తించారు. కార్యక్రమంలో ఆర్ఐ అర్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **ఒత్తిడికి గురికావొద్దు**

**కొండపాక(గజ్వేల్):** విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికావొద్దని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాద్ నాయుడు కోరారు. స్థానిక జూనియర్ కళాశాలలో గురువారం హార్ట్‌ఫుల్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఒత్తిడికి గురైతే ఉత్తమ ఫలితాలు సాధించలేమన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి అమరేందర్‌రెడ్డి, అధ్యాపకులు శశిధర్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీలీల, అనిత, సత్యనారాయణ, శివప్రసాద్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

◆ **అటవీ కళాశాలలో వైద్యశిబిరం**

**ములుగు(గజ్వేల్):** స్థానిక అటవీ కళాశాల, పరిశోధన సంస్థ(ఎఫ్‌సీఆర్ఐ)లో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనిధి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్, హైదరాబాద్ లయన్స్‌క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో విద్యార్థులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. కళాశాల ప్రతినిధులు శ్రీనివాస్‌రావు, కవిత, ఉపేంద్ర, నరేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

◆ **108లో ప్రసవం**

**గజ్వేల్‌రూరల్:** పురిటినొప్పులతో బాధపడుతున్న ఓ మహిళ 108 వాహనంలో పండంటి బాబుకు జన్మనిచ్చిన ఘటన గురువారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని కొల్గూరుకు చెందిన రమ్య పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108కు ఫోన్‌చేశారు. అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ రాజు, పైలెట్ మహిపాల్ రమ్యను ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో ఆమె బాబుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు.

◆ **మున్సిపల్ అధ్యక్షుడిగా శ్రీకాంత్**

**దుబ్బాక:** బీజేపీ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడిగా శ్రీకాంత్‌యాదవ్ నియామకమయ్యారు. జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి అమర్నాథ్ గురువారం ఆయనకు ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీ రఘునందన్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు బాలేష్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

◆ **క్రీడలతో శారీరక దృఢత్వం**

**హుస్నాబాద్:** క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుందని వాజ్‌పాయ్ యూత్ అసోషియేషన్ నిర్వాహకుడు బత్తుల శంకర్ బాబు అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్, షటిల్ పోటీలను స్థానిక మినీ స్టేడియంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ క్రీడలను ప్రోత్సహిస్తున్నారన్నారు. అసోసియేషన్ సభ్యులు చిట్టి గోపాల్‌రెడ్డి, రాంప్రసాద్, రాజేందర్, శ్రీనివాస్, నరేశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.